స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

108 బంగారు పద్మాలతో పూజలు

బుగులు వెంకన్న ఆలయంలో వేడుకలు

చిల్పూరు, జూన్ 4 : మండల కేంద్రం లోని బుగులు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామివారికి అష్టాదశ పాద పద్మారాధన పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తిరుపతిలో జరిగినట్లుగా 108 బంగారు పుష్పాలతో అష్టాదశ పాద పద్మారాధన నిర్వహించారు అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ అష్టాదశ పాద పద్మారాధన పూజలను ప్రతి మంగళవారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ డైరెక్టర్ సంగోజు మోహన్‌చారి-శంకరలక్ష్మీ దంపతులు, హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి దంపతులు, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, కృష్ణ, మహేశ్, రాజశేఖర్, విశాల్ పాల్గొన్నారు.

నేడు శివాలయంలో మండల పూజోత్సవం

దేవరుప్పులలోని శివాలయం

దేవరుప్పుల, జూన్ 4 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించి 41రోజులవుతున్న సందర్భంగా మంగళవారం మండల పూజోత్సవం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆలయ అర్చకుడు పెద్దాపురం వేంకటేశ్వరశర్మ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం శివాభిషేకం, అర్చనలు, ధ్వజస్తంభ మండల పూజ ఉంటుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివుడి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

భూతగాదాలో ఇరువర్గాల ఘర్షణ

ట్రాక్టర్ ట్రాలీ పడి మహిళ మృతి

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రఘునాథపల్లి జూన్ 4: భూ తగాదాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ఆంధ్రతండాలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రతండాకు చెందిన భూక్యా గణేశ్ -మంగమ్మ(40) దంపతులు. వీరికి గ్రామ శివారులోని గుట్ట సమీపంలో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లడానికి పొత్తుల దారి ఉంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మాలోత్ శివాద్రి, ధరావత్ బీల్యా ట్రాక్టర్ సాయంతో పొత్తుల రోడ్డుకు మంగళవారం మట్టిని పోస్తున్నారు. మంగమ్మ అక్కడి వెళ్లి ఇక్కడ ఎందుకు మట్టి పోస్తున్నారని అడ్డుపడింది. దీంతో మట్టి పోస్తున్న బీల్యా కుమారుడు రవీందర్, శివాద్రి, మాలోత్ కాళీ ఆగ్రహంతో మంగమ్మతో గొడవపడి ఆమెను నెట్టేశారు. దీంతో ఆమె కిందపడడంతో ట్రాక్టర్‌లో ఉన్న మట్టిని కిందకు పోయమని బీల్యా తన కుమారుడైన రవీందర్ కు సైగ చేశాడు. దీంతో మట్టిని పోసేందుకుకు టాక్టర్ జాకీని లేపాడు. దీంతో ట్రాలీ మంగమ్మ మీద పడడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కొడకండ్ల, జూన్ 4 : మండలంలోని గుమ్మల బండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లెల గడ్డ తండాలో రైతు ఇస్లావత్ బిచ్యాకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. మంగళవారం మేత కోసం పొలాల్లోకి వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోని కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురైంది. దీంతో మంటలు చెలరేగి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు బిచ్యా కోరారు.

పెంబర్తిలో గత సంవత్సరం పచ్చగా ఉన్న పల్లెప్రకృతి వనం (ఫైల్)

పెంబర్తిలో ప్రస్తుతం ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనం

పచ్చదనంపై పట్టింపేది..?

- నర్సరీల్లో ఎండిపోతున్న మొక్కలు
- వానకాలం సమీపించినా పట్టని అధికారులు
- హరితహారం లక్ష్య సాధనపై నిర్లక్ష్యం

జనగామ రూరల్, జూన్ 4: మొక్కలే మానవాళికి జీవకోటి.. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ.. అనే నినాదంతో చేపట్టిన హరితహారం లక్ష్యం నెరవేరడం లేదు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో పెద్ద ఎత్తున నర్సరీలు ఏర్పాటు చేసి లక్షలాదిగా మొక్కలు పెంచారు. వర్షాకాలంలో ఊరూరా ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున వీటిని నాటటడంతో అవి పెరిగి పచ్చదనాన్నిచ్చాయి. ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారానికి ప్రాధాన్యమివ్వడం లేదు. ఫలితంగా జనగామ మండలంలోని నర్సరీల్లో మొక్కల పెంపకం తగ్గింది. వర్షాకాలంలో గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించినా కార్యరూపం దాల్చడం లేదు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో హరితహారాన్ని ఉద్యమంలా చేపట్టారు.

ఎల్లంల నుండి పెంబర్తికి వేళ్లే దారిలో ఎండిపోయిన హరితహారంలో నాటిన మొక్కలు

పెంబర్తిలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటటడంతో పర్యావరణం మెరుగైంది. గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్లు నెలకొల్పడంతో పచ్చదనం పెరిగింది. ఈ నేపథ్యంలో కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. ఇందుకు నిదర్శనమే పెంబర్తిలోని పల్లె ప్రకృతివనంలో మొక్కలకు నీళ్లు పెట్టేవారు లేక ఎండిపోతున్నాయి. మరోవైపు వరంగల్-హైదరాబాద్ హైవేపై, ఎల్లంల పెద్దమ్మ ఆలయం సమీపంలో మొక్కలకు నీరు పట్టడం లేదు. మొక్కలకు నీళ్లు పట్టేలా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. అధికారులు స్పందించి మొక్కలను సంరక్షించాలని కోరుతున్నారు.

మొక్కల పెంపకంపై పర్యవేక్షణ శూన్యం..

గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ప్రత్యేకంగా స్థలాలను కేటాయించి నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటిలో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచారు. వానకాలంలో వర్షాలు కురిసినప్పుడు ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసేవారు. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున నాటడడంతో నేడు అవి చెట్లుగా మారి పచ్చదనం సంతరించుకుంది. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక మొక్కల పెంపకాన్ని పట్టించుకోవడం లేదు. నర్సరీల్లో నీళ్లు పట్టకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

- పాశం రాజిరెడ్డి, పెంబర్తి గ్రామస్తుడు

పెంబర్తి జాతీయ రహదారి టంగుటూరు క్రాస్‌రోడ్డులో ఎండిపోయిన మొక్కలు

మొక్కల పెంపకంపై దృష్టి పెడతాం..

హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోయిన విషయం నాకు తెలియదు. ఇప్పటి వరకు ఎన్నికల బిజీలో ఉన్నాం. ఇకపై నర్సరీల్లో మొక్కల సంరక్షణకు దృష్టి సారిస్తాం. హరితహారంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటాం. పల్లెప్రకృతి వనాలు, నర్సరీల్లోని మొక్కలకు నీరందించేలా కృషి చేస్తాం. హరితహారంలో ఖాళీ స్థలాల్లో, రహదారులకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటిస్తాం. ఇందుకోసం సిబ్బందికి సూచనలిస్తాం.

- ఉప్పుగల్లు సంపత్ కుమార్, ఎంపీడీవో

ఐలోని మల్లన్నకు ప్రత్యేక పూజలు

రుద్రహోమంలో పాల్గొన్న ఈవో, అర్చకులు, భక్తులు

ఐనవోలు, జూన్ 4: ఐలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ఒగ్గు పూజాలరులు స్వామి వారికి మేలుకొలుపు నిర్వహించారు. అనంతరం ఒగ్గుపూజారులు ఆలయ ముఖ మండపంలో పెద్దపట్నం వేసి సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, గట్టు పురుషోత్తమశర్మ పాల్గొన్నారు.

నేడు, రేపు ఐసెట్

- దరఖాస్తు చేసుకున్న 86,514 అభ్యర్థులు
- వరంగల్, నర్సంపేట రీజియన్‌లో 8 పరీక్షా కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతి లేదు
- ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ నర్సింహాచారి వెల్లడి

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఐసెట్ 5, 6న నిర్వహించనున్నట్లు ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో జరిగే టీజీఐసెట్-2024కు మొత్తం రెండు తెలుగు రాష్ట్రాల్లో 86,514 మంది అభ్యర్థులు పరీక్షకు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు మళ్లీ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మూడు సెషన్స్ ఉంటాయని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించేది లేదని తెలిపారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో మొత్తం 8 పరీక్ష కేంద్రాల్లో మూడు సెషన్లలో 4,659 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. నర్సంపేట్ జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, వరంగల్, హనుమకొండలో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, వశిష్ట టెక్నాలజీస్, తాళ్ల పద్మావతి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, బొల్లికుంట, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ, కిషన్‌పురా, నోబెల్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ చింతగట్టు, హసన్‌పర్తి ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

మరింత ఉత్సాహంతో పనిచేస్తాం..

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



కడియం కావ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి

తొర్రూరు, జూన్ 4: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో విజయం సాధించడంలో పాలకుర్తి నియోజకవర్గం తనదైన పాత్రను పోషించిందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. తొర్రూరులో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. కావ్య గెలుపు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మలుపు అని, ఎంపీ గా మంచి మెజార్టీని అందించిన ప్రజలకు, విజయానికి కష్టపడిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశం కలిసి వచ్చిందని, అసెంబ్లీ ఎన్నికల కంటే మంచి ఫలితాలను నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అందించినట్లు తెలిపారు. ఈ ఉత్సాహంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నేతలు హనుమాండ్ల తిరుపతి రెడ్డి, హమ్యానాయక్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

కేయూలో నూతన విభాగాధిపతుల నియామకం

నూతన విభాగాధిపతులతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: కాకతీయ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల్లో ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు నూతన అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సోషియాలజీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఫిజిక్స్ విభాగాధిపతిగా డాక్టర్ జి.మంజుల, గణితశాస్త్ర విభాగాధిపతిగా డాక్టర్ ఆర్.భారవిశర్మ, బొటనీ విభాగాధిపతిగా డాక్టర్ ఎం.లలితకుమారి, జియాలజీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్ నరెడ్డి నియామకమయ్యారు. వీరు ప్రస్తుత విభాగాధిపతుల నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరిని బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు.

పెళ్లయిన నెలకే..

- అనస్థీషియా టెక్నీషియన్ మృతి
- ఫుడ్ పాయిజన్‌తో దవాఖానపాలు
- చికిత్స పొందుతూ మృతి
- గ్రామంలో విషాదఛాయలు

ప్రణయ్‌కుమార్(ఫైల్)

నల్లబెల్లి, జూన్ 4: ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతూ అనస్థీషియా టెక్నీషియన్ మృతి చెందిన ఘటన నల్లబెల్లిలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కొత్తపెల్లి కోటిలింగాచారి ఏకైక కుమారుడు ప్రణయ్(26) వరంగల్ ములుగురోడ్డులోని అజర హాస్పిటల్‌లో అనస్థీషియా టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. తాను పని చేస్తున్న దవాఖానలోనే నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న యువతిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారం రోజుల క్రితం ప్రణయ్ ఓ పాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రెండు సమోసాలు తిన్నాడు. కొద్దిసేపటికి వాంతులు, విరోచనాలు కావడంతో తాను పని చేస్తున్న అజర హాస్పిటల్‌లోనే చికిత్స కోసం చేరాడు. ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యసేవల కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం ప్రణయ్ మృతి చెందాడు. వివాహం జరిగి కనీసం నెల రోజులైనా కాకముందే కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అందరితో కలివిడిగా ఉండే ప్రణయ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ప్రణయ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నిర్లక్ష్యపు నీడలో కాకతీయ కళాతోరణం

సుందరీకరణ పనులు చేపట్టని రాష్ట్ర ప్రభుత్వం

జనగామ రూరల్, జూన్ 4: చారిత్రక కట్టడాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందనడానికి నిదర్శనమే వరంగల్-హైదరాబాద్ హైవేపై పెంబర్తి శివారులోని కాకతీయ కళాతోరణం. ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖద్వారంలో నిర్మించిన కళాతోరణాన్ని పరిరక్షించడంలో కాంగ్రెస్ సర్కారు పట్టనట్లు వ్యవహరిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలోనైనా కళాతోరణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతారని స్థానికులు బావించినా నెరవేరలేదు. కళాతోరణంలోని కళాఖండాలు శిథిలమవుతున్నా పునరుద్ధరించడంలేదు. సంబంధిత అధికారులు సుందరీకరణ పనులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఛిద్రమవుతున్న వరంగల్-హైదరాబాద్ హైవేపై పెంబర్తి శివారులో కాకతీయ కళాతోరణం

ఏపీలో వైసీపీ వైఖరితోనే టీడీపీకి పట్టం

రఘునాథపల్లి, జూన్ 4 : ఏపీలో వైఎస్సార్‌సీపీ అనుసరించిన విధానాలే ఆ పార్టీ ఓటమికి కారణమయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రామచంద్ర య్య అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏపీలో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించిన నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలో సంబురాలు చేశారు. రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే పార్టీకీ పట్టం కట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల మల్లేశ్, ఉమ్మగోని నర్సయ్యగౌడ్, కొంగరి నర్సింగరావు, జహంగీర్, తానాజీ, కొమరంజీ, నకిర్త సత్తయ్య, మాల మల్లేశం, పిన్నింటి మల్లారెడ్డి పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

కొడకండ్ల, జూన్ 4 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన ఘటనలో వరంగల్ నగరానికి చెందిన పుల్లూరు గోవిందరాజ్‌పై పోలీసులు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ మహేందర్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. సీఐ మాట్లాడుతూ యువతిని మోసగించిన గోవిందరాజ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుప్చామని వివరించారు. ఎవరైనా ఆడపిల్లలతో ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

దేవరుప్పులలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

6నుంచి ఆర్ఎంపీల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని నిరాహారదీక్ష

దేవరుప్పుల, జూన్ 4 : ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలు ఆందోళన నిర్వహించనున్నట్లు ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు మేకపోతుల వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొని ఆందోళనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్ఎంసీ పేర ఆర్ఎంపీ, పీఎంపీలపై రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేయిస్తున్న నేపథ్యంలో తాము జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని వారు వివరించారు. అనంతరం కలెక్టరేట్ ముందు రిలే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. జిల్లాలోని 800మంది ఆర్ఎంపీ, పీఎంపీలు ఈ ర్యాలీలో పాల్గొంటారని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంగ రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు గుండు సుధాకర్, కోశాధికారి తీగల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కర్రె శ్రీశైలం, ప్రభాకర్, కొంగ సతీశ్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతీబాయి

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో కళావతీబాయి

చిన్నగూడూరు జూన్ 4: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్య సిబ్బంది పాటుపడాలని డీఎంహెచ్‌వో కళావతీబాయి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని ఉగ్గంపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలనపై ఆరా తీశారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, సురక్షిత గర్భస్రావాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో ఓపీల సంఖ్యను పెంచాలన్నారు. వానకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు వారాంతపు పరీక్షలు తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది మంగమ్మ, రాధాకుమారి, మాధవి, సుమలత, తార, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబురాల్లో అపశ్రుతి

డోర్నకల్, జూన్ 4: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ గెలుపొందడంతో డోర్నకల్ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఆ పార్టీ నాయకులు మంగళవారం పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తకు చేతిలో పటాకు పేలడంతో స్వల్పగాయాలయ్యాయి. స్థానిక దవాఖానలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

డోర్నకల్, జూన్ 4 : ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ తండాలో సోమవారం జరిగింది. ఏఎస్సై కోటేశ్వరరావు కథనం ప్రకారం.. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ తండాకు చెందిన బానోత్ భోజ్యా (40) అప్పుల బాధ భరించలేక సోమవారం సాయంత్రం ఇంట్లో చీరెతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భోజ్యాకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి కొడుకు దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

లక్ష్మీనారాయణ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీనారాయణకు నివాళి

గార్ల, జూన్ 4 : సీపీఐ మండల మాజీ కార్యదర్శి ఎల్లంకి లక్ష్మీనారాయణ 4వ వర్ధంతిని మంగళవారం రాంపురం గ్రామంలో నిర్వహించారు. ఆయన స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేశ్, రాగం కృష్ణయ్య, నగేశ్, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల రద్దీ

డోర్నకల్, జూన్ 4: ఆదిలాబాద్ -తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం తిరుపతికి వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడింది. విద్యార్థులకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో రాజుతండా, బర్లగూడెం నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. దీంతో రైలు ప్రయాణికులతో కిక్కిరిసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729

WANTED FEMALE TELECALLERS
★Urgent Requirement for ICICI, HDFC Bank Personal Loans Fresher Female Tele-Callers, Vacancies: 40, Sal+Inc. etc.., Job Location: HNK, Cont: 8886188690.
NTW-5697

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565